# సముద్రం

నేను పిచ్చాసుపత్రిలో వున్నప్పుడు వచ్చింది ఆ ఈ మెయిల్. ఒక పత్రిక వాళ్లు పంపింది. ప్రత్యేక సంచికకు కథ రాయమని. మా ఆవిడే చెప్పింది నాకా విషయం.

ఆమె నేను ఆసుపత్రిలో వున్న విషయం రహస్యంగా వుంచింది. ఒక్క మా పిల్లలకి మాత్రమే తెలుసు. నాకు పిచ్చెక్కిన సంగతి అందరికీ తెలియడం ఆమెకు చిన్నతనంగా అనిపించింది. కొంతకాలం చూసి బాగ్గాకపోతే అప్పుడు అందరికీ చెప్పొచ్చు అనేది ఆమె వుద్దేశ్యం.

నా వేపు చూసింది. ఆ చూపులో చాలా అర్థాలతో పాటు కథ రాస్తారా అనే ప్రశ్న కూడా వుంది.

"ఊ?" అంటూ తలతో ప్రశ్నించింది వూపి.

"రాస్తాను కథ" అన్నాను.

"ఈ కండీషన్లోనా" అంది ఆపిల్‌ని చేతిలోకి తీసుకుంటూ. "సరే సరే రాయండి మీకూ కాస్త ఛేంజ్‌గా వుంటుంది"

ఏ కండీషన్లో అని గొడవ పెట్టుకుందామని నోటిదాకా వచ్చి వూరుకున్నాను. పిచ్చివాళ్లు చేసే మొదటి వాదన తమకి పిచ్చి లేదనిట పైగా.

"రాయను. చెబ్తాను. నువ్వు రాసి పెడతావా"

తల వూపింది అంగీకారంగా.

"పెన్నుతో రాయాలి అయితే" అన్నాను.

అదోలా చూసింది. నేను రాబోతున్న కోపాన్ని ఆపుకున్నాను.

నేను కథలు చెప్పి ఇప్పటికి చాలా కాలం అయింది. వీడియో కాసెట్ ప్లేయర్స్ కొత్తగా వచ్చిన రోజుల్లో అనుకుంటా పిల్లలకు కథలు చెప్పేవాణ్ణి.

పిల్లలకు కథలు చెప్పడంలో హుషారుని అనుభవించాల్సిందే! పెద్ద గొంతుతో జంతువులాగా అరవొచ్చు. మొహాన్ని ఎంత వికారంగానైనా మార్చుకోవచ్చు. ఇష్టమొచ్చినట్టు గెంతొచ్చు. అప్పట్లో నన్నెవరూ పెద్దగా గమనించినట్టు లేదు. లేకపోతే అప్పుడే నన్ను పిచ్చాసుపత్రిలో వేసేవాళ్లు. అలా చెప్పేవాణ్ణన్నమాట.

అయితే నేను చెప్పిన కథల్లో ఎలాంటి ప్రత్యేకతా అయితే వుండేది కాదు. అందరూ చెప్పేలాంటివే. వింటున్న పిల్లల్నే కథలో హీరోల్ని చెయ్యడం. ప్రజల్ని చంపుకుతినే ఓ రెండుతలల రాక్షసుణ్ని గెలవడం. ఒక పెద్ద మృగం లేదా ఏ గ్రహాంతరవాసుల బారినుండో ఈ ప్రపంచాన్ని రక్షించడం. ఇలాంటివే. అయితే కథలు చెప్పడంలోని ఆనందంతో పాటు, పిల్లల్తో కాళ్లు తొక్కించుకునే ప్రతిఫలాన్ని కూడా ఆశించేవాణ్ణి. పిల్లలు అలా తొక్కుతుంటే నిద్రలోకి జారి పొయ్యేవాణ్ణి.

పిల్లలు తొక్కడం మానినా, శ్రద్ధలో తేడా వచ్చినా నా నోరు టక్కున మూత పడేది. ఒక్కోసారి రివైండయి కథ మొదటినుంచి ప్రారంభమయ్యేది. ఇంకోసారి కథ వొక్కసారిగా చివరికి వెళ్లిపోయేది. పిల్లలకి వెంటనే తెలిసిపోయేది తాము చేసిన తప్పు. గోలగోల చేసి మళ్లీ శ్రద్ధగా తొక్కడం ప్రారంభించేవాళ్లు. పిల్లల ముందు నన్ను నేను విసిపీగా అభివర్ణించుకున్న ఆనాటి కథల వ్యవహారం అది.

ఇది పెద్దల కోసం చెబుతున్న కథ. కాస్త వాళ్లు దగ్గరుంచుకోవాలి. పిల్లలంత తేలిగ్గా మోసపోవడానికి సిద్ధంగా వుండరు పెద్దవాళ్లు.

• • •

వారం నించి రోజూ వస్తోంది ఆ కల.

అతడు అంతవరకూ అటువంటి కలను ఎరగడు.

అపార జలరాశి కనుచూపు మేరదాకా. పొగమంచులో కలిసిపోయిన అంతులేని తీరం ఎన్ని యోజనాలుందో ఎవరికీ తెలీదు. ఏవేవో పక్షులు. ఒడ్డంతా మెత్తటి ఇసుక. ఆ అనంతజలరాశికి వూపిరితిత్తులు కనక వుంటే అవి తీసే శ్వాసలాగే వుంది, దాని నిరంతర హోరు. దేవుడు తనకోసం చేసుకున్న అద్దంలా తళతళా మెరిసిపోతున్న ఆ దృశ్యం ఎవరూ వూహించడానికి వీల్లేనిది.

చాలామంది పండితుల్ని సంప్రదించాక, చాలా గ్రంథాలు చదివాక దాన్ని సముద్రం అంటారని తెలిసింది అతడికి. అది ఎంతో దూరంలో భూగోళానికి అవతలివైపు వుంటుందట.

ఎప్పుడైతే దానికొక పేరు ఖాయం అయిందో అప్పణ్ణించి ఆ కల రావడం మానేసింది. సముద్రస్వప్నం కోసం ఎదురు చూసి ఎదురుచూసి నిస్సారంగా గడుస్తున్నాయి అతడి రోజులు.

రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూసినట్టుంది మిగతా లోకం అతడికి. నిజానికి అతడే ఓ రాజు.

దేశంలోని మహాపర్వతాలు, దుర్గమారణ్యాలు, నేలను తాకేంత దగ్గరగా సాగిపోయే మేఘమాలికలు, జలపాతాలూ, విశాల జలాశయాలు అతణ్ణి తృప్తిపరచలేక పోతున్నాయి. పదే పదే ఆ సముద్రదృశ్యం అతణ్ణి నిర్వీర్యుణ్ణి చేస్తోంది.

సముద్రం లేని దేశం ఒక దేశమేనా?

దేశాధినేతగా అతడి ప్రజలకు ఇవ్వగలిగిన బహుమతేదైనా వుంటే అది సముద్రమే. అంతకన్నా గొప్పది ఈ సృష్టిలో మరొకటి లేదు. ఈ నిర్ణయానికి రావడానికి చాలా సమయాన్నే తీసుకున్నాడు. ఎన్నో వైపుల్నించి ఆలోచించాల్సిన బాధ్యత అతడిది.

ఓరోజు సభాముఖంగా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆ ప్రకటనకు ముందే సముద్రాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. మహాసేనల్లాగా మునుముందుకు ఉరికే అలల గురించి చెబుతున్నపుడు అందరూ వూపిరి తీసుకోవడం మరిచిపోవడాన్ని అతడు గమనించాడు. అలల తుంపరల్లాగా లక్షలాది పక్షుల విహారాన్ని చెబుతున్నపుడు అందరి కళ్లలో చిప్పిల్లుతున్న వెలుగురవ్వల్ని చూశాడు. అందరూ సముద్రపు హోరును తమ హృదయ లయల్లోకి ఆవాహన చేసుకుంటున్న ఉత్తేజిత క్షణాల్లోనే అతడి నిర్ణయాన్ని ప్రకటించాడు అదును చూసి.

అందరూ ఉద్వేగంతో లేచి నిలబడ్డారు. ఏవేవో నినాదాల ద్వారా తమ సమ్మతిని ప్రకటించారు. సముద్రపు హోరు అప్పుడే మొదలయినట్టుగా అనిపించింది దేశాధినేతకు.

సముద్రాన్ని తవ్వడానికి ఓ శుభముహూర్తాన్ని నిర్ణయించారు

సిద్ధాంతులు. అయితే ముహూర్తానికి చాలాముందే ప్రజలంతా తమ బంగారాన్నంతా ఖజానాకి సమర్పించారు. భవిష్యత్ భయాన్ని సముద్రకోరికతో జయించిన ప్రజలు.

బంగారమంతా ఇనపగునపాలుగా మారింది.

"ఎంతోకాలంగా మనం సంపదని పోగు చెయ్యడానికి బతికాం. బతుకుతున్నాం. ఒక భరోసా తప్ప ఏమైనా వుందా అందులో. ఇకనించి ఒక అనుభూతి కోసం బతకబోతున్నాం" దేశాధినేత మనసు పరవళ్లుతొక్కుతోంది. "మనం చేస్తున్న పని ఈ ప్రపంచంలో ఎవరూ వూహించలేనిది"

"మనముందున్నది వొకటే. తవ్వడం. మనం తవ్వుదాం. ఎంతకాలం తీసుకుంటుందో ఆలోచించడం మన పని కాదు. దాన్ని కాలం చూసుకుంటుంది. నీళ్లు ఎలా నింపాలా అనేది కూడా మన పని కాదు. దాన్ని ఆకాశం చూసుకుంటుంది.

"మనపని కేవలం తవ్వడం. ఇంతకాలం యుద్ధాల్ని ఎలా తెగించి చేశామో అలా చెయ్యడం" అంటూ గునపాన్ని నేలలోకి దించాడు దేశాధినేత.

కొన్ని లక్షల గునపాలు నేల వేపు దూసుకుపోయాయి.

• • •

కళ్లు తెరిచాను.

నా భార్యా పిల్లలతో పాటు ఓ ఇద్దరు నర్సులూ, అటెండర్లూ చుట్టూ గుమికూడి శ్రద్ధగా వింటున్నారు. అంతకు ముందురోజు నేను చెయ్యి చేసుకున్న అటెండర్ కూడా వున్నాడు వాళ్లలో. డబ్బుల్ని చింపనీకుండా అడ్డుకోవచ్చా నన్ను మరి?

కథను కొనసాగించాను కళ్లు మూసుకుని.

• • •

ఏళ్లు గడిచిపోతున్నాయి. ఆ తవ్వకం మాత్రం ఆగలేదు. ఆ పనిలో ఎంతోమంది మరణించారు. అయినా కొత్తవాళ్లు పుట్టుకొస్తూనే వున్నారు. దేశాధినేత వృద్ధుడయ్యాడు.

ఏదో తినడానికి ఇంత పండించుకోడం. అవసరమైనన్ని పశువుల్ని పోషించుకోవడం. మిగతా సమయమంతా సముద్రాన్ని తవ్వడం. అంతే!

ఈ విషయం చుట్టూ వున్న దేశాలకు నవ్వులాటగా మారింది. దాన్నొక పిచ్చివాళ్ల దేశంగా అనుకోవడం ప్రారంభించారు. ఆ దేశంలో బక్కచిక్కిన పశువుల దగ్గర్నించి, ఆధునీకరించబడని వాళ్ల ఆయుధాల వరకు ఎన్నో... నవ్వు తెప్పించే అంశాలుగా మారిపోయాయి.

ఇదే అదనుగా కొందరు ఆ దేశాన్ని ఆక్రమిద్దామని వ్యూహాలు కూడా చేశారు. కానీ అక్కడ ఏముందని? ఒక పాడి లేదు. ఒక పంట లేదు. బంగారమూ లేదు. అంతా ఇనుమే!

ఈ వార్త అలా పాకి ఇలా పాకి దూరంగా వున్న సముద్రానికి తెలిసింది. మొదట్లో నమ్మలేదు. కానీ అనేక మార్గాల్లో పదేపదే అదే విషయం వినేసరికి నమ్మకతప్పలేదు సముద్రానికి.

ఆశ్చర్యపడింది. ఎంత పిచ్చాళ్లయినా ఇంత దుస్సాహసమా! క్రమక్రమంగా కోపంతో వూగిపోయింది.

తనను తయారుచెయ్యడమా! తనెలా తయారయిందో ఇన్ని యుగాలైనా తనకే తెలీదే. తన చీకటి గర్భంలో చలించే మహామహా జలచరాల్ని ఒడ్డునబడితే తప్ప తనే గుర్తించలేదే! సూర్యుడు కూడా చొరలేని అగాధాలను, పర్వతాలను, అగ్ని విస్ఫోటనాలను కడుపులో దాచుకున్న నిగూఢగాథ కదా తనది! తనని తయారుచేసే సాహసమా! అసలు ఆ ఆలోచన చేసినందుకే కరకరా నమిలెయ్యాలి ఆ మూర్ఖుల్ని.

పిచ్చివాళ్ల దేశం ఎంత దూరం వుందో అంచనా వేసుకుంది. తన కడుపుని అవసరమైనంత వేగంగా సుళ్లు తిప్పి కావలసినంత శక్తిని బుజాల్లోకి తెచ్చుకుని కుప్పించి ఎగిరి ముందుకు దూకింది. రెండు తాడిమానులంత ఎత్తున లేచింది. తీరప్రాంతాల్ని ముంచేస్తూ తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

దూరం నించి చూస్తే లక్షలాది సముద్రపక్షుల్ని, దట్టని మబ్బుల్ని వెంటేసుకుని జూలు విదిల్చి కదిలి వస్తున్న మహా మృగంలాగా కనిపించింది సముద్రం. ప్రచండమారుతాలు దాని దారిని శుభ్రపరుస్తూ ముందుగా పరుగులు తీస్తున్నాయి. ఆ భీకరస్వరూపాన్ని చూసి ప్రళయకాలమేమోనని చుట్టూ వున్న ప్రాణులన్నీ కకావికలై తలో దిక్కుకు పారిపోతున్నాయి. జనవాసాల్లోకి రావడం అదే మొదటిసారి సముద్రానికి.

మానవసమాజాల్ని చూసి విస్తుపోయింది. మనుషులు ఇంత ఇరుగ్గా జీవిస్తుంటారా అనే ఏవగింపుతోనే సాగింది దాని ప్రయాణమంతా. ఏనుగుల్నే మచ్చిక చేసుకున్న ఈ ఆరడుగుల ప్రాణులు తన మీద మాత్రం స్వారీ చెయ్యరా కాలం కలిసొస్తే! స్వారీ ఏం ఖర్మ తనని సమూలంగా నాశనం చెయ్యగల నిక్షిప్తశక్తుల్ని కూడా ఆ చిన్న మానవశరీరాల్లో వాసన చూడ గలిగింది సముద్రం. దూరంగా వున్న లక్ష్యాల్ని ఛేదించే ఆయుధాల్ని చూశాక మనిషి ఎన్ని అధర్మయుద్ధాలకు పాల్పడబోతున్నాడో కదా అని విచారించింది. ఇంత అందమైన ప్రపంచంలో ఈ అత్యాశాపరుణ్ణి సృష్టించడం వెనక దేవుడి ఆంతర్యాన్ని ప్రశ్నిస్తూనే సాగింది దాని పరుగు.

మానవుల దేవుళ్లని చూశాక వీళ్లలాగే వీళ్ల దేవుడు కూడా ఎంత మరగుజ్జు అని జాలిపడింది.

అలా ఎన్నో దేశాల్ని, అరణ్యాల్ని, నదుల్ని, జీవరాశుల్ని పొట్టన పెట్టుకుంటూ ప్రయాణించిన సముద్రం చివరికి పిచ్చివాళ్ల దేశాన్ని సమీపించింది.

మిగతా దేశాల్లాగా సస్యశ్యామలంగా లేదది. కొండల మీద అరకొర సాగుతో అక్కడక్కడా విసిరేసినట్టున్న పంటలు. దారుల్నిండా పిచ్చి మొక్కలు. కొండచరియల మీద గూఢచారులు ప్రహరా కాసే రక్షణదుర్గాలు బోసిపోయి వున్నాయి. ఎక్కడా మనుషుల జాడ లేదు. దిక్కూమొక్కూలేని దేశంలా వుంది. సైన్యపు జాడ ఏకోశానా లేదు. ఏ ఇంటికీ తాళాలు లేవు. పరిపాలనే లేని ఆ దేశాన్ని వెక్కిరిస్తున్నట్టుగా ఏవో చిన్నచిన్న జంతువులు

యథేచ్ఛగా తిరుగుతున్నాయి. మృతదేశంలా అనిపించింది చల్లగా.

అంత నిశ్శబ్దంలోనూ దూరాన్నించి శబ్దాలు!

కొండల అవతల కొన్ని లక్షలమంది చీమలమందలాగా తవ్వే పనిలో నిమగ్నమై వున్నారు. 'ఓహో! ఇక్కడన్నమాట సముద్రాన్ని తవ్వుతున్నది' తల పంకించింది సముద్రం. తన సహచరులందర్నీ వుష్ అని సైగ చేసి నిశ్శబ్దంగా పిచ్చివాళ్లని సమీపించింది.

సామూహిక శిల్పాన్ని చెక్కుతున్నంత శ్రద్ధగా తవ్వుతున్నారు. దేశాధినేత వర్ణించిన సముద్రం తప్ప ఇంకో ఆలోచన లేకపోవడం వల్ల బార్లా తెరిచిన వాకిళ్లలా వున్నాయి వాళ్ల మనసులు.

ఒంటి మీద సరైన బట్టలు కూడా లేకుండా కఠోరంగా శ్రమిస్తున్న ఆ బక్కపలచటి మనుషుల్ని చూసి అలాగే నిశ్చేష్టయైపోయింది సముద్రం. వీళ్లా తనని తయారుచేసేది?

గద్దిస్తున్నట్టు వొక్కసారిగా ఫెళఫెళా వురిమింది.

ప్రపంచం ముక్కలయ్యేంత శబ్దం!

అందరూ గాభరాపడి వెనక్కి చూశారు. వాళ్ల చేతుల్లో గునపాలు జారిపోయాయి. కళ్లు విభ్రాంతితో విచ్చుకున్నాయి. చలనం లేకుండా అలా నిలబడిపోయారు ఆ దృశ్యం ముందు.

వేయి తలల సర్పంలా ప్రత్యక్షమైన సముద్రాన్నీ, తలపాగాలా ఆవరించిన లక్షలాది పక్షుల్నీ, మేఘాల్నీ, యోజనాల మేరకు విస్తరించిన మంచుతీరాల్ని చూసి పారవశ్యంతో మోకాళ్ల మీద కూలబడిపోయారు.

వృద్ధుల్నీ, యువకుల్నీ, పిల్లల్నీ, ఆడవాళ్లనీ తేరిపార చూసింది సముద్రం.

వాళ్ల ఒంటి మీద ఖరీదైన వస్త్రాలు లేకపోవచ్చు. నగలూ నట్రా లేకపోవచ్చు. కానీ ఒక అవిరామ దీక్ష వల్ల కాయలు కాసిన వాళ్ల అరచేతుల్నించి పూలవాసన వీస్తోంది.

అంతమంది కళ్లలో వువ్వెత్తున నిలబడిన తన ప్రతిరూపాన్ని చూసి ముగ్ధురాలయింది సముద్రం. అంతవరకు తనని చూసి భయంతో పారిపోయిన వాళ్లే తెలుసు దానికి.

ఎప్పుడో మరిచిపోయిన తన హృదయం చప్పుడు చేస్తున్నట్టు పసిగట్టింది.

వాళ్ల కళ్లల్లోంచి కురుస్తున్న అద్భుత రసానికి చలించి పోయింది. తనలోనూ ఏదో కరుగుతూ కదులుతున్న రసం.

తన ప్రమేయం లేకుండా తనలోంచి ఉబికి ఉబికి వస్తున్న కొత్తనీటితో ఆ ప్రాంతం తడిసిపోయింది.

అయితే అది తన కన్నీరే అని తెలుసుకోడానికి సముద్రానికి ఎంతో సమయం పట్టలేదు. బరువుగా వెనుతిరిగింది.

ఆ కన్నీరే ఆ పిచ్చివాళ్ల దేశంలో సముద్రంగా మిగిలి పోయింది. అందుకే ఆ దేశంలో సముద్రపు నీరు వుప్పగా వుంటుంది.

• • •

ముగించాను. అందరూ నావేపే చూస్తున్నారు, రౌండ్స్‌కు వచ్చిన డాక్టరుతో సహా. ఆ గదిలోని ప్రతి కన్నూ ఒక సముద్రం లాగా తోచింది నా కంటికి.

-రమణ జీవి